క్లుప్తంగా

అంబాపురం గ్రామ పంచాయతీకి కొత్త రిక్షాలు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త సేకరణకు అవసరమైన నాలుగు అల్యూమినియం రిక్షాలను కొనుగోలు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు తెలియజేశారు. గతంలో ఉన్న చెత్త రిక్షాలు పాడవటంతో వాటి స్థానే కొత్తవి కొనుగోలు చేశామన్నారు. వాటితో పాటు పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన ప్లాస్టిక్ డిప్పలు(10), పారలు (10), దంతలు(10), చీపుర్లు(25) గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో కొనుగోలు చేసినట్లు కార్యదర్శి తెలియజేశారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



కంకిపాడు: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కంకిపాడు సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు కీర్తన ట్యుటోరియల్స్ అధినేత చంద్రశేఖర్ నాయుడు వితరణతో క్రీడా దుస్తులను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ అజ్గర్, హెచ్ఎం సుధారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.హరిగోపాల్, ఎల్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

కంకిపాడు: వైద్య సేవల్లో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని ఉప్పులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా ఉప్పులూరు పీహెచ్‌సీలో బుధవారం వేడుకలు జరిగాయి. వైద్యాధికారి డాక్టర్ సాయి నిఖిత, ఫార్మసిస్ట్ మాలతి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ శారమ్మ, యూడీసీ గ్లోరీ, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్టు

కంకిపాడు: బెల్టు షాపు నిర్వాహకుడిని కంకిపాడు పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు... మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన అన్నే సీతారామయ్య నివాసం వద్ద తనిఖీ చేయగా అతని వద్ద 50 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయాలకు పాల్పడుతున్న సీతారామయ్యను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.సందీప్ తెలిపారు.

చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, మర్లపాలెం గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి సాగులో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు మండల వ్యవసాయ అధికారి ఎస్ఎల్. తేజస్వి సలహాలు, సూచనలు ఇచ్చారు. వరి సాగుకు సంబంధించి రైతులు వ్యక్తపరిచిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని సూచించారు. తద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

45మందికి 104 వైద్య సేవలు

గన్నవరంరూరల్: మండలంలోని చనుపల్లివారిగూడెంలో బుధవారం 104 వాహన వైద్య సేవలను గ్రామస్తులకు అందించారు. సీహెచ్‌వో సింధూర, వైద్య సిబ్బంది పాల్గొని 45 మంది దీర్ఘకాల రోగులను పరీక్షించి మందులు అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా భారత్




గన్నవరం రూరల్: కేంద్రంలో బీజేపీ సారథ్యంలో భారతదేశం ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగిందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గన్నవరం మండలంలోని జక్కులనెక్కలం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె బుధవారం పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం గజేంద్ర, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నాదెండ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'నో డామేజ్' మెసేజ్‌తో నివ్వెరపోయిన బాధితులు



అంబాపురం గ్రామంలో వరద ముంపునకు గురైన మొగిలిచర్ల లక్ష్మి ఇల్లు(ఫైల్)



ప్రభుత్వం నుంచి సీఎం ఫొటోతో వచ్చిన మెస్సేజ్

ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలి



ఇటీవల వచ్చిన వరదల్లో మా ఇల్లు పూర్తిగా ముంపునకు గురైంది. సర్వే సిబ్బంది వచ్చినప్పుడు మా ఇల్లు ముంపునకు గురైనట్లు గుర్తించి నా భార్య మొగిలిచర్ల లక్ష్మి పేరు నమోదు చేశారు. ఇప్పుడు ఫోనులో మీ ఇల్లు ముంపునకు గురికాలేదని మెసేజ్ వచ్చింది. ఈ విధంగా చాలా మందికి మెసేజ్‌లు వస్తున్నాయి. దయచేసి మా లాంటి వారికి ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలి.

–మొగిలిచర్ల మధు, అంబాపురం

- వరద బాధితులకు సీఎం బొమ్మతో మెసేజ్‌లు
- ఆగ్రహంతో రగిలిపోతున్న గ్రామస్తులు
- తొందరపడవద్దని సముదాయించిన పంచాయతీ సిబ్బంది

అంబాపురం(విజయవాడరూరల్): ఈ నెల 13,14 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ చేసి అంబాపురం గ్రామంలో 1747 ఇళ్లు ముంపునకు గురైనట్లు జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం ఎప్పుడు వస్తుందా అని బాధితులు వెయ్యి కళ్లతో ఎదురుచూశారు. ఆర్థిక సాయం అందితే ఆ మొత్తంతో ఇంట్లో వంట సామగ్రి, గృహోపకరణాలు కొనుగోలు చేసుకోవచ్చునని ఎదురుచూస్తున్న తరుణంలో గ్రామంలో కొందరు వరద బాధితుల మొబైల్ ఫోన్లకు మీ ఇళ్లు ముంపునకు గురికాలేదని (నో డామేజ్) అని సీఎం చంద్రబాబు ఫొటో ఉన్న మెసేజ్ వచ్చింది. సుమారు 30 మందికి ఈ విధంగా మెసేజ్‌లు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వారంతా బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఈ విషయమై సిబ్బందిని నిలదీశారు. అయితే సిబ్బంది తొందరపడకండంటూ వారిని సముదాయించారు. వరదల్లో పూర్తిగా నష్టపోయిన తమకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం వెంటనే అందేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



కృష్ణాజిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు.

లబ్ధిదారులు గృహాల నిర్మాణం పూర్తి చేయాలి



పెనమలూరు మండల కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

పెనమలూరు: జగనన్న కాలనీలో జరుగుతున్న గృహాల నిర్మాణ పనులను లబ్ధిదారులు వెంటనే పూర్తి చేయలని ఎంపీడీవో సునీతాశర్మ అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, అధికారులతో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వణుకూరులో జగనన్న కాలనీలో ఉన్న లేఅవుట్లలో లబ్ధిదారులు గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో 5325 గృహాలకు గాను 945 గృహాల నిర్మాణం పూర్తి అవగా ఇంకా 4380 గృహాల నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. పెనమలూరు మండల పరిధిలో 2473 గృహాలకు గాను 1034 గృహాల నిర్మాణం పూర్తయ్యాయని, ఇంకా 1439 గృహాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. లబ్ధిదారులు వెంటనే గృహాల నిర్మాణం చేపట్టాలని, వచ్చే ఏడాది మార్చి తరువాత కేంద్రం నుంచి నిధులు అందవని, ఈ విషయం లబ్ధిదారులు గుర్తించాలని సూచించారు. ఈ మేరకు ఈ నెల 28న వణుకూరు లేఅవుట్‌లో లబ్ధిదారులకు సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓల బదిలీలు

కంకిపాడు: రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న పలువురు వీఆర్‌ఓలు బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల పరిధిలో పనిచేస్తున్న పలు గ్రామాల వీఆర్‌ఓలు తాజా ఉత్తర్వుల్లో బదిలీ అయ్యారు. మద్దూరు వీఆర్‌ఓ బి.నాగిరెడ్డి పునాదిపాడు-2 సచివాలయానికి బదిలీ అయ్యారు. వేల్పూరు వీఆర్‌ఓ కె.ప్రవీణ్ తెన్నేరు వీఆర్‌ఓగా, కోలవెన్ను వీఆర్‌ఓ కె.సందీప్ ప్రొద్దుటూరు వీఆర్‌ఓగా, కుందేరు వీఆర్‌ఓ ఎం.రఘురామ్‌ప్రసాద్ నెప్పల్లి వీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. తెన్నేరు వీఆర్‌ఓ పి.సురేష్‌బాబు కుందేరు వీఆర్‌ఓగానూ, నెప్పల్లి వీఆర్‌ఓగా పనిచేస్తున్న పి.సూర్య నరసింహారావు బాబు గొడవర్రు వీఆర్‌ఓగా, ప్రొద్దుటూరు వీఆర్‌ఓ పీవీ విజయ్‌కుమార్ పునాదిపాడు-1 సచివాలయ వీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. పునాదిపాడు-1 వీఆర్‌ఓగా పనిచేస్తున్న ఆర్ఎస్‌కే మల్లికార్జునరావు కోలవెన్ను వీఆర్‌ఓగా, పునాదిపాడు-2 వీఆర్‌ఓ కె.వరప్రసాద్ పెనమలూరు మండలం వణుకూరు-2 వీఆర్‌ఓగా, మంతెన వీఆర్‌ఓ ఆర్.సుబ్రమణ్యం వేల్పూరు వీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. కంకిపాడు-2 వీఆర్‌ఓల ఎన్.మాధురీదేవి కానూరు-1 వీఆర్‌ఓగా, ఉప్పులూరు వీఆర్‌ఓ కె.ఏడుకొండలు పోరంకి-3 వీఆర్‌ఓగా కంకిపాడు-3 వీఆర్‌ఓ ఎన్.నరసింహారావు ఉయ్యూరు మండలం కాటూరు-1 వీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. కంకిపాడు-1 వీఆర్‌ఓ జి.దుర్గారావమ్మ ఉంగుటూరు మండలం తేలప్రోలు-1 వీఆర్‌ఓగా, దావులూరు వీఆర్‌ఓ ఎస్.శివనాగమణి గన్నవరం మండలం సావరిగూడెం వీఆర్‌ఓగా బదిలీ అయ్యారు. గన్నవరం మండలం బుద్ధవరం-2 వీఆర్‌ఓగా పనిచేస్తున్న కె.అర్జునరావు ఉప్పులూరు వీఆర్‌ఓగా, మోపిదేవి మండలం మెరకనపల్లి వీఆర్‌ఓ జి.సుబ్బారావు కంకిపాడు-2 వీఆర్‌ఓగా, గన్నవరం-1 వీఆర్‌ఓ కె.సృజన్ మద్దూరు వీఆర్‌ఓగా, కాటూరు-1 వీఆర్‌ఓ వై.డేవిడ్‌రాజు మంతెన వీఆర్‌ఓగా గన్నవరం మండలం పురుషోత్తమపట్నం వీఆర్‌ఓ రెడ్డి నాగకొండబాబు దావులూరు వీఆర్‌ఓగా, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం వీఆర్‌ఓ చిన్నం నాగేశ్వరరావు కంకిపాడు-3 వీఆర్‌ఓగా రానున్నారు.

పురుగు మందులు మోతాదు మించి వాడొద్దు



పెనమలూరు: రైతులు ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వాడరాదని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. మండల పరిధిలోని వణుకూరు, గోసాల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకంపై రైతులకు సరైన అవగాహన ఉండాలన్నారు. సిఫార్సు మించి వాడితే ఖర్చు అధికం అవటమే కాకుండా ఆశించిన ఫలితం ఉండదని వివరించారు. పొలంలో కలుపు మందు, పురుగుల మందు కలిపి వాడరాదని సూచించారు. ఇలా చేస్తే పంట ఎదుగుదలపై ప్రభావం పడుతుందని అన్నారు. ప్రస్తుతం వరి పంటలో కాంప్లెక్స్ ఎరువులు వాడనవసరం లేదన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచిదని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి చందుజోసెఫ్, వీఏఏలు కిరణ్మయి, చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

సీఏ విద్యార్థికి మానవత రూ.2 లక్షల ఆర్థికసాయం



పేద విద్యార్థికి ఆర్థికసాయాన్ని అందిస్తున్న మావనత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద సీఏ విద్యార్థికి మానవత సేవా సంస్థ ద్వారా రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా మండవల్లి మండలం గన్నవరం గ్రామానికి చెందిన మందపాటి నాగ రామాంజనేయులు కుమార్తె లక్ష్మీ శరణ్య సీఏ కోర్సు అభ్యసిస్తుండగా ఆర్థిక సమస్యల కారణంగా ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో మానవత సంస్థను ఆశ్రయించగా రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం రూ.1.75 లక్షలు అందించగా, మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ తరపున రూ.25 వేలు ఆర్థికసాయాన్ని పంపిణీ చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో విద్యార్థిని లక్ష్మీ శరణ్యకు మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదగా బుధవారం అందించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, సభ్యులు అవిర్నేని వెంకట్రావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, జన్యావుల సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, చుక్కా సుబ్బారావు, తాడి రంగారావు పాల్గొన్నారు.

పెనమలూరు పీఎస్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల విషయంలో పకడ్బందీగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో విచారణలో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, అనుమానితులు, కేడీలపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెనమలూరు పరిధిలో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే పిటీషన్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వర న్యాయం చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పరిపాలన పారదర్శకంగా ఉండాలని సూచించారు.

ఉపాధ్యాయుడైన కమిషనర్



ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు కొద్దిసేపు ఉపాధ్యాయుడుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పట్టణంలోని 13వ వార్డులో గల ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఈ ఘటన నెలకొంది. కమిషనర్ వెంకటేశ్వరరావు ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. ఆ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు సంధించి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు.

పోరంకి గ్రీన్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ అపర్ణ

పెనమలూరు: విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు పోరంకి గ్రీన్ స్కూల్‌కు అవార్డు లభించింది. పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ ఈ మేరకు బుధవారం వివరాలు తెలుపుతూ ఎడ్యుకేష్ టుడే స్కూల్స్ నెట్ వర్క్స్ ఆధ్వర్యంలో విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించిన స్కూల్స్‌ను ఎంపిక చేశారన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎడ్యుకేటర్స్ సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2024–2025 ప్రకటించారన్నారు. ఉత్తమ స్కూల్‌గా పోరంకి గ్రీన్ స్కూల్‌ను ఎంపిక చేసి అవార్డు ఇచ్చారన్నారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు అవార్డును ప్రతినిధుల నుంచి అందుకున్నట్లు అపర్ణ తెలిపారు. పాఠశాల చైర్మన్, డైరెక్టర్ వంశీకృష్ణ, శాంతి పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు రూ.7లక్షల విరాళం



సీఎం చంద్రబాబుకు రూ.5.50 లక్షల చెక్కు అందజేస్తున్న పెనమలూరు టీడీపీ నేతలు

పెనమలూరు: పెనమలూరు టీడీపీ సీనియర్ నేత మారుపూడి ధనకోటేశ్వరరావు ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం పెనమలూరు టీడీపీ నేతలు రూ.5.50 లక్షల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. దీనితో పాటు సాయిబాబా ట్రస్టు కింద కోయా గోపాలకృష్ణ రూ.లక్ష చెక్కును సీఎం చంద్రబాబునాయుడికి అందచేశారు. ఉయ్యూరుకు చెందిన విజయసాయి పాఠశాలకు చెందిన యాజమాన్యం, విద్యార్థులు రూ.50 వేల చెక్కును పోరంకిలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోయా ఆనందప్రసాద్, తోటకూర ఉదయ్‌భాస్కర్, కిలారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

గన్నవరం: మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావును గన్నవరం గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. బాపులపాడు పంచాయతీ కార్యదర్శి సీవీఎల్ఎస్ఆర్‌వీ ప్రసాద్‌ను కేసరపల్లి గ్రామ పంచాయతీకి నియమించారు. ప్రస్తుతం ఇక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎం.మౌనికను ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు బదిలీ చేశారు. ఉంగుటూరు మండలం తరిగొప్పల కార్యదర్శి ఎం.సరోజిని బుద్ధవరం గ్రామపంచాయతీకి బదిలీకాగా, ప్రస్తుతం అక్కడ కార్యదర్శిగా పనిచేస్తున్న బి.సత్యబాబు జి.కొండూరు మండలం వెలగలేరుకు బదిలీ అయ్యారు. బాపులపాడు మండలం కానుమోలు గ్రామపంచాయతీ కార్యదర్శి పి. ఉమామహేశ్వరరావును అల్లాపురం గ్రామపంచాయతీకి బదిలీ చేశారు.

నేడు నున్నలో గ్రామసభ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో గురువారం ఉదయం 11 గంటలకు సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన గ్రామసభ జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2047 స్వర్ణాంధ్ర విజనరీ రూపకల్పనలో భాగంగా గ్రామ సభలో అయిదు సంవత్సరాల ప్రణాళికను తయారు చేస్తారన్నారు.

24 మంది క్రీడాకారుల ఎంపిక



నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అండర్-19 కేటగిరీ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక కార్యక్రమం బుధవారం జరిగింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికల్లో నున్న జెడ్పీ హైస్కూల్, ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ లకు చెందిన 24 మందిని ఎంపిక చేశారు. వెయిట్ 30 నుంచి 95 కేజీల బేసిక్‌గా ఎంపికలు జరిగినట్లు పీఈటీ విజయ్‌వర్మ తెలిపారు.

ప్రకటన

[illegible]

తేది : 24.9.2024
స్థలం : విజయవాడ
వై. సూర్య మోహన్, అడ్వకేటు, డోర్ నెం.23-2-23, సెకండ్ ఫ్లోర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా శ్రీనగర్ బ్రాంచి బిల్డింగ్, భగత్‌సింగ్ రోడ్, లక్ష్మీనగర్, సత్యనారాయణపురం, విజయవాడ - 520 011.

పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ



ఉయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉయ్యూరు: పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కాంక్షిస్తూ మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ శివనాథ్ మాట్లాడుతూ స్వచ్ఛమైన పరిసరాలతో వ్యాధులు దరిచేరవన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శేఖర్‌బాబు, నరసింహారావు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో సురక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రసాదంపాడు పంచాయతీ కార్యదర్శి జె.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రసాదంపాడులో పలు అంతర్గత రహదారుల్లో బుధవారం తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మట్టి నమూనాల ఫలితాలను బట్టి ఎరువులు

ఉంగుటూరు: మట్టి నమూనాల పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులను తగు మోతాదులో వాడాలని మండల వ్యవసాయ అధికారి వి.హరీష్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు రసూల్, ఆర్.రాణి, రైతులు పాల్గొన్నారు.

పెనమలూరులో వ్యక్తిపై దాడి

పెనమలూరు: కుటుంబ తగాదాల కారణంగా పెనమలూరులో ఓ వ్యక్తిపై పలువురు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎస్.రమేష్ అనే వ్యక్తి పెనమలూరులో ప్రైవేటు అకాడమీలో మెస్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్యతో విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం హాస్టల్ గదిలో ఉన్న సమయంలో భార్య తాలూకూ బంధువులు చెన్నుపాటి శరత్, గోగినేని చంద్ర, నల్లూరి సతీష్, జాలాది వెంకటేష్, కందిమళ్ల శరత్ వచ్చి రమేష్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని సైక్లిస్టుకు గాయాలు

పెనమలూరు: పోరంకి-నిడమానూరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ రాజు అనే వ్యక్తి పోరంకి నిడమానూరు రోడ్డులో ఉన్న బాలాజీ హైట్స్‌లో ఉంటూ తాపీ పని చేస్తాడు. అతని తండ్రి దేవరకొండ వెంకటేశ్వర్లు అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉంటాడు. వెంకటేశ్వర్లు సైకిల్ పై బయటకు వెళ్లి తిరిగి నిడమానూరు రోడ్డులో ఇంటి వద్దకు వస్తున్న సమయంలో బైక్ అతి వేగంగా వచ్చి అతనిని ఢీ కొట్టింది.ఈ ఘటనలో వెంకటేశ్వర్లు తలకు బలమైన గాయమైంది. అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చారు. కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు సెయింట్ మేరీస్ క్రీడాకారులు



కంకిపాడు: మండల స్థాయిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్‌లో కంకిపాడు సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులు రాణించారు. చెస్‌లో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు, ప్రిన్సిపాల్ చిత్ర అభినందించారు. వారు మాట్లాడుతూ ఈనెల 24న కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో చెస్‌లో అండర్-14 బాలుర విభాగంలో బి.సతీష్, బి.వెంకట పార్థివ్‌సాయి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. బాలికల విభాగంలో టి.వినీత, సి.ప్రణీత, డి.షణ్ముఖప్రియ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను దక్కించుకున్నారన్నారు. అండర్-17 బాలుర విభాగంలో టి.సుశాంత్, కె.పవన్‌సాయి సిద్ధార్థ ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించి నియోజకవర్గ స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజేతలను ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.